క్లుప్తంగా

2న స్విమ్మింగ్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్విమ్మింగ్ పోటీలకు సంబంధించి జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్ జట్ల ఎంపికలను వచ్చే నెల 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మధు, కె.సనత్‌కుమార్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో జరిగే ఈ ఎంపికలకు 10 – 17 సంవత్సరాల మధ్య వయసున్న వారు గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3కి అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఇందుకూరుపేట: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కాలవమూల కండ్రిగలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు కిసాన్‌నగర్‌కు చెందిన కందల కొండలరావు (53) ప్లంబింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాలవమూల కండ్రిగలో ఓ ఇంటికి ప్లంబింగ్ చేసేందుకు పని ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం మెషీన్‌తో గోడను కట్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ కె.రామకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తుకూరు పోలీసులకు ఎస్పీ ప్రశంసలు

ముత్తుకూరు: ఆస్తుల రికవరీ, బెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో ముత్తుకూరు పోలీసులు అత్యుత్తమ ప్రతిభకనబర్చడంతో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రశంసలతో ముంచెత్తారు. బుధవారం నెల్లూరులో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్సై శివకృష్ణారెడ్డితో పాటు పలువురు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి ఆర్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షలకు 1755 మందికి గానూ 1637 మంది హాజరయ్యారు. 118 మంది గైర్హాజరయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షలకు 1128 మందికి గానూ 1022 మంది హాజరయ్యారు. 106 మంది గైర్హాజరయ్యారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.

బీసీల హక్కుల కోసం సంఘటిత పోరాటం

మనుబోలు: బీసీల హక్కుల కోసం సంఘటితంగా పోరాడుదామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య పిలుపునిచ్చారు. మనుబోలులోని పద్మావతి కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తేనే దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ మనుగడ సాధ్యమన్నారు. బీసీ హక్కుల కోసం అందరం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాముఆచారిని సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘ నాయకులు లీలాకృష్ణయాదవ్, అంకయ్య, శేఖర ఆచారి, రాము, మునికృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, నందీశ్వరరావు, యుగంధర్, చిన్నరమణయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ శిబిరం

పొదలకూరు : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చడంపై శిక్షణా శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ పొదుపు మహిళలను పారిశ్రామికవేత్తలుగా నిలపాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఇందుకోసం రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తోందన్నారు. పొదుపు మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నపాటి యూనిట్లను గ్రౌండింగ్ చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం రోజ్‌మేరి, ఎస్‌బీఐ, ఏపీజీబీ, ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్‌ఆఫీసర్లు, సీసీలు, వీఓఏలు, ఎంఎస్, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

కోవూరు: పొదుపు సంఘాల సభ్యులకు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు బ్యాంక్ లింకేజీ డీపీఎం చంద్రశేఖర్ తెలిపారు.

సమస్యల పరిష్కారమే 'జగనన్న సురక్ష' లక్ష్యం

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సచివాలయ పరిధిలో ప్రజా సమస్యలను అధికార యంత్రాంగం తక్షణమే పరిష్కరించే కార్యక్రమమే జగనన్న సురక్ష అని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 47వ డివిజన్లో గల చిన్నబజార్, సవరాలవీధి, గిడ్డంగి వీధి, పాలబూత్ సెంటర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై ఇంటింటికీ వెళ్లి ఆరాతీశారు. అర్హులకు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలను తెలుసుకున్నామని, దాదాపు రూ.14 కోట్లతో రోడ్డు ప్యాచ్ వర్కులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, తదితర పనులను పూర్తి చేశామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు పరదాలు కట్టుకొని తిరుగుతున్నారంటూ నారా లోకేశ్ మాట్లాడుతున్నారని, తనకైతే ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. సాయంత్రం వేళ పాదయాత్ర చేస్తోందెవరో ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించే పరిస్థితి తీసుకొచ్చిన ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ల్యాండ్ మాఫియా, రౌడీయిజం, రకరకాల వేధింపులు ఎక్కడ జరుగుతున్నాయో టీడీపీ నేత అబ్దుల్ అజీజ్ దాదాపు మూడు నెలల క్రితం చెప్పారని, ఇవన్నీ చేసిన నేతలను ఆ పార్టీ చేర్చుకుందని విమర్శించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అనిల్‌కుమార్

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కల్పవృక్ష వాహనసేవ



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కల్పవృక్ష వాహనసేవను కనులపండువగా బుధవారం నిర్వహించారు. చప్పరోత్సవాన్ని ఉదయం జరిపారు. ఉభయకర్తలుగా వేనాటి మల్లికార్జున్‌రెడ్డి, సుస్మిత దంపతులు, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రేణుక ప్రసాద్ వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

వెంకటేశ్వరపురంలో రెవెన్యూ సదస్సు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రెవెన్యూ సమస్యలకు వార్డు సచివాలయాల్లో సత్వర పరిష్కారం లభించనుందని నెల్లూరు అర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా పేర్కొన్నారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలోని నల్లకాలువ వద్ద గల సచివాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కుల, ఆదాయ, రేషన్ కార్డులకు సంబంధించిన సమస్యలుంటే సచివాలయ సిబ్బంది వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ దేవరకొండ అశోక్, బాగి వెంకటరమణ, సచివాలయ అడ్మిన్ చైతన్య, వీఆర్వోలు చంద్రశేఖర్, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నిర్మలానందబాబా

విగ్రహావిష్కరణకు తరలిరండి

నెల్లూరు (వేదాయపాళెం): గుంటూరులో జూలై తొమ్మిదిన నిర్వహించనున్న సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణకు తరలిరావాలని బీసీ నేత ఆరంబాకం చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని పూలే విగ్రహ సెంటర్‌లో బీసీ నేతలు బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. బీసీ నేతలు ఎన్నెస్ యాదవ్, లలితారామ్, దినేష్, డాక్టర్ మహేంద్ర, పవన్, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు

కళాశాలలపై చర్యలకు వినతి

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులను వసూలు చేస్తూ.. పుస్తకాలు, యూనిఫారాలను విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నరహరి కోరారు. స్టోన్‌హౌస్‌పేటలోని కార్యాలయంలో ఆర్‌ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యదర్శి ఈశ్వరయ్య, నేతలు కమలాకర్‌రావు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌ఐఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

సీతారామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నెల్లూరు(బృందావనం): హరనాథపురం రెండో వీధిలోని సీతారామాలయ దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ స్వీకారాన్ని బుధవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పసుపులేటి గంగాధర్, శ్రీధర్, ఉపాధ్యక్షులుగా దువ్వూరు గోపాల్‌రెడ్డి, రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా చంద్రా మస్తానయ్య, దారా పుల్లయ్య, కోశాధికారిగా తుమ్మలచర్ల వాసుబాబు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభ్యులను సత్కరించారు. అడ్వొకేట్లు నాగిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బసిరెడ్డి శ్రీనివాసకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక హక్కులపై అవగాహన అవసరం

నెల్లూరు (టౌన్): ప్రాథమిక హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అదనపు జిల్లా జడ్జి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మూలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లలందరూ బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, అంగవైకల్యం ఉన్న వారికి ఉచిత న్యాయ సాయాన్ని అందించాలనే ఉద్దేశంతో న్యాయసేవాధికార సంస్థల చట్టాన్ని రూపొందించారని తెలిపారు. చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి పవన్‌కుమార్

క్రీడా దుస్తుల అందజేత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొననున్న జిల్లా జట్టుకు క్రీడా దుస్తులను అందజేశారు. నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదం వాసు మాట్లాడారు. నూజివీడులో ఈ నెల 29 నుంచి పోటీలను నిర్వహించనున్నారని చెప్పారు. కెప్టెన్ అనీష్, మణి సంతోష్, యశ్వంత్, భగత్, సునీత్, ఆర్యన్, రామ్ చరణ్, రిహాన్, లక్ష్మీనరసింహారెడ్డి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. కోచ్‌గా చైతన్య వ్యవహరించనున్నారని పేర్కొన్నారు.



సేవే పరమావధిగా వృద్ధాశ్రమాలు సాగాలి

నెల్లూరు(బృందావనం): సేవే పరమావధిగా వృద్ధాశ్రమాలు సాగాలని 25 కళాసంఘాల అధ్యక్షుడు, హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. హెచ్ ఆర్ ఫొటోగ్రఫీ అధినేత నేదురుమల్లి హరనాథరెడ్డి ఇస్కాన్ సిటీలో స్థాపించిన ద్వారకామాయి వృద్ధాశ్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కార్పొరేటర్ చేజర్ల మహేష్, డాక్టర్ నిశ్చలప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి, ఆంజనేయరెడ్డి, అందె శ్రీనివాసులు, మోహన్‌రాజు, నందకుమార్, పార్థసారథిరెడ్డి, కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

అనారోగ్యంతో జీవిత ఖైదీ మృతి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న జిల్లా కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న వల్లూరు తిరుమలకుమార్(31) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు..బుచ్చిరెడ్డిపాళెం మండలం పెద్దపూరులోని శివాలయం రెండో వీధికి చెందిన తిరుమలకుమార్ అల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2014లో నమోదైన ఓ కేసులో జీవిత ఖైదీగా జిల్లా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. బుధవారం ఉదయం తిరుమలకుమార్ అనారోగ్యంతో అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఈ విషయంపై ఆర్డీవో మలోల, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విచారణ జరిపారు. జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాలకు చెక్

- జిల్లా వ్యాప్తంగా విద్యుత్ భద్రత వారోత్సవాలు
- అన్ని డివిజన్లలో అవగాహన సదస్సులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తగు జాగ్రత్తలు పాటించడం ద్వారా విద్యుత్ ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చు. ఈ విషయమై వినియోగదారులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా జూన్ 26 నుంచి జూలై రెండు వరకు జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. గృహ, వ్యవసాయదారులు, రైతు కూలీలు, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు పాటించాల్సిన భద్రత చర్యలపై విద్యుత్ శాఖ అధికారుల, విజిలెన్స్ అధికారులు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు, ప్రమాణాలు పాటించాలో వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ డివిజన్లు, సబ్ డివిజన్లలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో విద్యార్థులను సైతం భాగస్వాములను చేస్తున్నారు. భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తే విద్యుత్ ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పక్కాగా వైరింగ్

- ఇళ్లకు వైరింగ్ చేసే సమయంలో ఎర్త్ ఏర్పాటు కోసం రెండు ఎల్రక్ట్రోడ్లను అమర్చుకోవాలి.
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్ వైర్లతో ఇతర పరికరాలను వాడుకోకూడదు.
- విద్యుత్ ఉపకరణాలను వినియోగించే సమయంలో తయారీదారులు నిర్దేశించిన సామర్థ్యం కలిగిన త్రీ పిన్ సాకెట్లనే వాడాలి.
- విద్యుదాఘాతం సంభవించకుండా ఇళ్లలో 30 ఏఎంపీ సామర్థ్యం కలిగిన వైర్లనే వాడాలి.
- విద్యుదాఘాతానికి గురైన వ్యక్తిని రక్షించే క్రమంలో ఇతరులు నేరుగా తాకకుండా విద్యుత్ సరఫరాను ఆపేసి కర్ర సాయంతో రక్షించాలి.

పరిశ్రమల్లో ప్రమాణాలు కీలకం

- కాటన్ మిల్లుల్లో ప్యానల్ బోర్డు, మోటార్ల లోపలికి కాటన్ డస్ట్ వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- ఎర్త్ కనెక్షన్లు, వైరింగ్ లూజ్‌గా లేకుండా జాగ్రత్తలు పాటించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్ చుట్టూ 1.8 మీటర్ల ఎత్తులో ఫెన్సింగ్‌కు ఎర్త్‌ను ఏర్పాటు చేసి ఇతరులు లోపలికి వెళ్లకుండా జాగ్రత్త వహించాలి.
- అన్ని స్విచ్ బోర్డుల ప్యానళ్ల ముందు రబ్బర్ మ్యాట్లను ఏర్పాటు చేయాలి.
- స్విచ్ బోర్డులకు ఇండస్ట్రియల్ ప్యానల్ బోర్డులనే వినియోగించాలి.
- ఐఎస్‌ఐ ప్రమాణాలు కలిగిన లైటింగ్, పవర్ సాకెట్లు, వైర్లు, స్విచ్‌లను మాత్రమే వినియోగించాలి.
- పరిశ్రమల పరిసరాల్లో పీవీసీ పైపుల ద్వారా శాశ్వతంగా వైరింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- లైటింగ్ డిస్ట్రిబ్యూషన్ బోర్డులో 30 మిల్లీ యాంప్స్, పవర్ డిస్ట్రిబ్యూషన్ బోర్డుకు 100 మిల్లీ యాంప్స్, ఎస్కలేటర్లకు 300 మిల్లీ యాంప్స్ ఆర్సీసీబీలనే వినియోగించాలి.

అవగాహన అవసరం

- వ్యవసాయ పంప్ సెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్ల స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు ఎర్తింగ్ చేయించాలి.
- విద్యుత్ షాక్ తగలకుండా 30 ఎంఏ సామర్థ్యం కలిగిన ఆర్సీసీబీలను మాత్రమే వినియోగించాలి.
- తడి చేతులు, నీటిలో నిలబడి మోటార్ల స్విచ్‌లు వేయకుండా జాగ్రత్తలు పాటించాలి.
- మోటార్లు పనిచేయని సమయంలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రిపేర్లు చేయకూడదు.
- పొలాల్లో తెగిపడిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి సంబంధిత అధికారులు, సిబ్బంది లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారమివ్వాలి.
- పొలాల్లో పంటలను నాశనం చేస్తున్న జంతువుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లకు విద్యుత్ సరఫరా చేయకూడదు.

అవగాహన కల్పిస్తున్నాం



విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా వినియోగదారులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ వినియోగంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరిస్తున్నాం.
– శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్, విద్యుత్ విజిలెన్స్, నెల్లూరు సర్కిల్

అన్ని వర్గాలను భాగస్వాములు చేయడమే లక్ష్యం

విద్యుత్ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని అన్ని డివిజన్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అధికారులు, సిబ్బంది వివరిస్తున్నారు.
– వెంకటసుబ్బయ్య, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్ నెల్లూరు జిల్లా సర్కిల్

ఒకటి నుంచి చండీ యాగం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో గల కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో చండీ యాగాన్ని జూలై ఒకటి నుంచి మూడు వరకు నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనాలనుకునే వారు 96528 60264, 99499 18358 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మణి సంస్మరణ సభ నేడు

నెల్లూరు (వేదాయపాళెం): మణి బుక్‌స్టాల్ వ్యవస్థాపకుడు, హేతువాద ఉద్యమ నేత టీపీ మణి సంతాప సభను టౌన్‌హాల్లోని రీడింగ్ రూమ్‌లో గురువారం సాయంత్రం 5.30కు నిర్వహించనున్నామని నెల్లూరు పట్టణ రోడ్డు మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘ కోశాధికారి హఫీజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వామపక్ష పార్టీల కార్యకర్తలు, అభ్యుదయవాదులు తరలిరావాలని కోరారు.

విద్యుత్ భవన్‌లో భద్రత వారోత్సవాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాలను ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలను జిల్లాలోని అన్ని డివిజన్లలో జూలై రెండు వరకు నిర్వహించనున్నామని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలకు గల ముఖ్య కారణాలు, ప్రమాదాల బారిన పడకుండా పాటించాల్సిన చర్యలను వివరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, జయకృష్ణారెడ్డి, పరంధామయ్య, బెనర్జీ, మధు, బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, మధు, తదితరులు పాల్గొన్నారు.



హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది మార్చి 23 నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో రూ.5,51,652 మేర భక్తులు సమర్పించారని ఈఓ వేణుగోపాల్ తెలిపారు. దేవదాయ శాఖ అధికారి సుధీర్ పర్యవేక్షించారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

నెల్లూరు సిటీ: టీడీపీ నేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర కాకుపల్లికి జూలై రెండున చేరుకోనుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. నగరంలోని తన కార్యాలయంలో టీడీపీ నేతలతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల కేంద్రంలో పండ్లు పంపిణీ

నెల్లూరు(బృందావనం): పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో పండ్లు, బిస్కెట్లను ముస్లిం సేవా కమిటీ జిల్లా అధ్యక్షుడు ఖాలిద్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. సభ్యులు ఇమ్రాన్, కౌషిక్, రబ్బానీ, వసీమ్, ఫిరోజ్, నవాజ్, తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తెలియజేశారు. పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కాంక్షించారు.